01.11.2026
ఆదివారం

www.bestvoicenews.com

bestvoice

బెస్ట్ వాయిస్

తెలుగు దినపత్రిక

సంపుటి:11 | సంచిక : 115 | వెల:రూ 1/- వరంగల్ ఎడిటర్: కె.మోహన్‌రావు పేజీలు 08

భర్త చనిపోతే.. భార్యకు వెంటనే పింఛను!

చేయూత పథకంలో కీలక మార్పులు

- వృద్ధాప్య పింఛనుతో పాటు ఆరు కేటగిరీలకూ వర్తింపు
- 57 ఏళ్లలోపు ఉంటే వితంతు పింఛను
- ఆపై వయసుంటే వృద్ధాప్య పింఛను
- అక్టోబర్ 30న ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

భర్తను కోల్పోయిన మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చేయూత సామాజిక భద్రతా పింఛను పథకం కింద పింఛను పొందుతున్న పురుష లబ్ధిదారుడు మరణిస్తే, ఆయన భార్యకు వెంటనే పింఛను మంజూరు చేసే సదుపాయాన్ని ప్రభుత్వం విస్తరించింది. ఇప్పటివరకు ఈ వెసులుబాటు కేవలం వృద్ధాప్య పింఛను పొందుతున్న పురుషుల భార్యలకు మాత్రమే అందుబాటులో ఉండేది.

బెస్ట్‌వాయిస్, స్టేట్‌బ్యూరో:

తాజాగా దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్ రోగులు, హెచ్ఐవీ బాధితులు, ఫైలేరియా బాధితుల కుటుంబాలకూ ఈ సదుపాయాన్ని వర్తింపజేసింది. దీంతో భర్త మరణించిన తర్వాత కుటుంబానికి అందుతున్న పింఛను నిలిచిపోవడం వల్ల ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు అవకాశం ఏర్పడింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అక్టోబరు 30వ తేదీ

మిగతా8లో..

సులభతరంగా గ్రావెల్ అనుమతులు

చిన్న నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన గ్రావెల్ (మట్టి) తరలింపునకు అనుమతులు సులభతరం చేసేందుకు జిల్లాలో సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు.

7

ప్రతి ఇంటికి పోలీసుల భద్రతా అవగాహన.. 'కమ్యూనిటీ కనెక్ట్'కు శ్రీకారం

నేరాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడమే కాకుండా, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు.

6

ఫిబ్రవరి 24 నుంచి ఇంటర్ పరీక్షలు!

- 2027 వార్షిక పరీక్షలకు బోర్డు సన్నాహాలు
- ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 1 నుంచే..
- మొదటి సంవత్సరం విద్యార్థులకూ ప్రయోగ పరీక్షలు
- ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు వర్తింపు
- అధికారిక టైమ్‌టేబుల్‌పై విద్యార్థుల్లో ఆసక్తి

బెస్ట్‌వాయిస్, స్టేట్‌బ్యూరో:

తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు 2027 నిర్వహణకు ఇంటర్మీడియట్ విద్యా మండలి సన్నాహాలు చేస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 24వ తేదీ బుధవారం నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సరాల థియరీ పరీక్షలు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన పరీక్షల షెడ్యూల్ రూపకల్పన దాదాపు పూర్తయినట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి 1వ తేదీ సోమవారం నుంచే నిర్వహించే

మిగతా8లో..

కొడగాని మోహన్‌రావు
-ఎడిటర్
99633 34550

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- **మండలాల వారీగా సమీక్షించిన మాజీ ఎమ్మెల్యే తాటి కొండ రాజయ్య, నాగుర్ల వెంకన్న**

బెస్ట్ వాయిస్,స్టేషన్ ఘనపూర్:

ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్త నాగుర్ల వెంకన్న కోరారు.శనివారం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని చిల్పూర్, రఘునాథపల్లి, లింగాల ఘనపురం మండల కేంద్రాల్లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంపై సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల గ్రామాల గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ఇన్‌చార్జులు, ప్రజాప్రతినిధులతో వారు సమావేశమై నమోదు ప్రక్రియ పురోగతిపై చర్చించారు.ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని, గ్రామాల వారీగా బాధ్యతలు తీసుకొని కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుకు దూరం కాకుండా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ సమావేశాల్లో మండల పార్టీ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, మాజీ సర్పంచులు, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, గ్రామ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్14 వాలీబాల్ జట్టుకు గూడూరు విద్యార్థి ఎంపిక

బెస్ట్ వాయిస్,పాలకుర్తి:

పాలకుర్తి మండలం గూడూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) విద్యార్థి వరుణ్ రాష్ట్రస్థాయి అండర్14 బాలుర వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని జేఎన్ఎస్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన అండర్14 బాలుర వాలీబాల్ ఎంపిక పోటీల్లో వరుణ్ పాల్గొని తన అద్భుతమైన ఆటతీరుతో ప్రతిభను చాటుకున్నాడు. పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి జట్టులో చోటు సంపాదించాడు. దీంతో గూడూరు గ్రామంతో పాటు పాఠశాల వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. విద్యార్థి వరుణ్ సాధించిన విజయంపై మండల విద్యాశాఖ అధికారి పోతుగంటి నర్సయ్య ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. చిన్న వయస్సులోనే క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ. శైలజ మాట్లాడుతూ* విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు ఎంతో దోహదపడతాయని క్రమశిక్షణ!పట్టుదల ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఉన్నత విజయాలు సాధించవచ్చని తెలిపారు. వరుణ్‌కు ప్రత్యేక శిక్షణ అందించి రాష్ట్రస్థాయికి ఎదిగేలా ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయుడు చిట్యాల యాదిని పలువురు అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు ఐ. శైలజతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయినులు వరుణ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీల్లోనూ వరుణ్ అద్భుత ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు గూడూరు గ్రామానికి పాలకుర్తి మండలానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

ఘనంగా లియాఫీ 1964 వరంగల్2 బ్రాంచ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- **ఏజెంట్ల ఐక్యతతోనే యూనియన్ బలోపేతం**
- **ఆలిండియా నాయకులు వై.వి. కృష్ణారావు**
- **బీమా రంగంలో రానున్న మార్పులను సమిష్టిగా ఎదుర్కోవాలి**
- **డివిజన్ అధ్యక్షుడు పులి సుధాకర్ గౌడ్**

బెస్ట్ వాయిస్,వరంగల్:

భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమైక్య (లియాఫీ 1964) వరంగల్2 బ్రాంచ్ 8వ సర్వసభ్య సమావేశం శనివారం వరంగల్‌లోని పోచమ్మ మైదాన్‌సమీపంలోగల ఇన్నర్‌వీల్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగింది. బ్రాంచ్ ఇన్‌చార్జి అధ్యక్షుడు ఆకుల కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ఆలిండియా నాయకులు వై.వి. కృష్ణారావు, డివిజన్ అధ్యక్షుడు పులి సుధాకర్ గౌడ్‌తో పాటు జోనల్, డివిజన్ స్థాయి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డివిజన్ మీడియా కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. తొలుత లియాఫీ మహిళా నాయకురాళ్ళు, ముఖ్య అతిథులు, యూనియన్ సభ్యుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం ఇటీవల అకాల మరణం చెందిన యూనియన్ సభ్యులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలిండియా నాయకులు వై.వి. కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఎల్ఐసీ ఏజెంట్ యూనియన్ సభ్యత్వం తీసుకుని సంఘటిత శక్తిలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. యూనియన్‌లో పదవులు పొందిన నాయకులు కేవలం హోదాలకే పరిమితం కాకుండా, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ పదవులకు న్యాయం చేయాలని సూచించారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని అన్నారు. డివిజన్ అధ్యక్షుడు పులి సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జీవిత బీమా రంగంలో అనేక కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయని, వాటిని సమర్ధంగా ఎదుర్కొనేందుకు ఏజెంట్లంతా సిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏజెంట్ల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన భద్రత కోసం లియాఫీ 1964 మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సంఘటిత ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఏజెంట్ యూనియన్ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆలిండియా నాయకులు గోపాల్‌రావు, జోనల్ నాయకులు మల్లాడి రాజిరెడ్డి, ఏ. వెంకట నారాయణ, గుండు సదానందం, గంజి రాంబాబు, బెల్లంకొండ శ్రీనివాస్, రాసూరు వేణుగోపాలరావు, శ్రీరాములు, రాజేశం, గోపాల్‌రాజ్ తదితరులు ప్రసంగిస్తూ ఏజెంట్ల ఐక్యత, యూనియన్ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణ, సభ్యుల సమస్యల పరిష్కారంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. డివిజన్ నాయకులు వెలివెల మోహన్‌రావు, ప్రభాకర్, పబ్బ రాజా శ్రీనివాసరావు, కూన మొగిలి, టి. సరస్వతి, వర్నె తిరుపతి తదితరులు కూడా తమ సందేశాలను అందించారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక..

సమావేశంలో భాగంగా డివిజన్ ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, డివిజన్ కోశాధికారి డి. ప్రభాకర్, డివిజన్ రెసిడెంట్ కార్యదర్శి పబ్బ రాజా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వరంగల్2 బ్రాంచ్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నాయకుల సమన్వయం, సభ్యుల ఏకాభిప్రాయంతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఆకుల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా దురిశెట్టి సంతోష్, కోశాధికారిగా డోలి కోటేశ్వర్, మహిళా కమిటీ ఇన్‌చార్జిగా జి. భార్గవి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి పలువురు నాయకులు, సభ్యులు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి, బ్రాంచ్ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆకాంక్షించారు.

నాయకులకు ఘన సన్మానం..

అనంతరం సమావేశానికి విచ్చేసిన ఆలిండియా, జోనల్, డివిజన్ స్థాయి నాయకులను వరంగల్2 బ్రాంచ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. బ్రాంచ్ అభివృద్ధికి గతంలో సేవలందించిన పాత కార్యవర్గ సభ్యులను సైతం ప్రత్యేకంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. యూనియన్ నిర్మాణంలో గత కమిటీ చేసిన కృషిని పలువురు నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు తండా అశోక్, చోల్లేటి అశోక్, వంగాల వీరస్వామి, ఇనుగాల శ్రీనివాస్, సింగారపు శ్రవణ్, చెల్పూరి శ్రీను, తిరుపతి, మన్నెం ఇంద్రారెడ్డి, కుర్న వెంకటేశ్వర్లు, వెలగందుల రాజేందర్, రఘునారెడ్డి, గుడికందుల రమేష్, కుడుతాజి రవీందర్, సదానందం, కంది ప్రభాకర్, గొల్ల సంపత్, బైరి రాజు తదితరులతో పాటు మహిళా నాయకులు అర్చన, సరిత, రమాదేవి, సునీత, మౌనిక, రజిని తదితరులు పాల్గొన్నారు.ఈ ఎనిమిదవ సర్వసభ్య సమావేశానికి వరంగల్2 బ్రాంచ్ పరిధిలోని సుమారు 250 మంది ఎల్ఐసీ ఏజెంట్లు హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు. నూతన కార్యవర్గం ఎన్నికతో బ్రాంచ్‌లో నూతన ఉత్సాహం నెలకొందని, ఏజెంట్ల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతామని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

పేరిణి నృత్యానికి ప్రధాని మోదీ ప్రశంసలు

- **భారత్ పర్వ్‌లో తెలంగాణ కళా సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు**

బెస్ట్ వాయిస్,గుజరాత్:

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ పర్వ్-2026లో తెలంగాణ రాష్ట్ర కళలు, సంస్కృతి, పర్యాటక విశేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన పేరిణి నృత్య ప్రదర్శనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా తెలంగాణ పర్యాటక విశేషాలను అసిస్టెంట్ టూరిజం ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్ ప్రధానమంత్రికి వివరించారు. రాష్ట్రానికి చెందిన ప్రసిద్ధ పోచంపల్లి వస్త్రకళ, చేర్యాల చిత్రకళతో పాటు ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ విశిష్టతలను వివరించారు. తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని జాతీయ స్థాయిలో పరిచయం చేసేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రధాని ఆసక్తిగా తిలకించారు.

అనంతరం పేరిణి నృత్య కళాకారులు, పర్యాటక శాఖ ప్రచార అధికారులు డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, చంద్రకాంత్‌లతో కలిసి ప్రధాని మోదీ ఫొటోలు దిగారు. తెలంగాణ కళలు, సంప్రదాయాలు, పర్యాటక ప్రాంతాలను దేశవ్యాప్తంగా పరిచయం చేసేందుకు భారత్ పర్వ్ వేదిక దోహదపడిందని డాక్టర్ కుసుమ సూర్యకిరణ్ పేర్కొన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి ప్రదర్శనలు తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధికి, రాష్ట్ర సంస్కృతికి మరింత గుర్తింపు తీసుకురావడానికి ఉపయోగపడతాయని ఆమె తెలిపారు.

మేకల రవి మరణం కమ్యూనిస్టు పార్టీకి,దళిత ఉద్యమానికి తీరని లోటు

- **మేకల రవి మృత దేహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నేతలు.**

బెస్ట్ వాయిస్,వరంగల్:

నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు నిలబడ్డ వ్యక్తి కామ్రేడ్ మేకల రవి అని, ఆయన మరణం కమ్యూనిస్టు పార్టీకి,దళిత ఉద్యమానికి తీరని లోటని యంఆర్పియస్ జాతీయ నాయకులు పుట్ట రవి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ అన్నారు. వరంగల్ శివ నగర్ ప్రాంతానికి చెందిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ కార్యదర్శి కామ్రేడ్ మేకల రవి(57) అనారోగ్యంతో మరణించిన సందర్భంగా రవి మరణవార్త విషయాన్ని తెలుసుకున్న పుట్ట రవి ,చుంచు రాజేందర్ మేకల రవి భౌతిక దేహనికి పూల మాలల వేసి నివాళులర్పిస్తూ సంతాపం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మేకల రవి అనారోగ్యంతో అమరత్వం పొందడం బాధాకరమని, రవి కష్టనష్టాల్ని ఎదుర్కొని మంచితనంతో, కలుపుకోలుతనంతో ఎంతో మంచి పేరు తెచ్చుకోవడం జరిగిందని అన్నారు. మేకల రవి 1984లో అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) లో చేరి ఎఐవైఎఫ్ వరంగల్ నగర కార్యదర్శిగా, 2005-2014 వరకు సిపిఐ వరంగల్ నగర కార్యదర్శిగా మూడు పర్యాయాలు, అనంతరం మాజీ వరంగల్ రూరల్ మరియు అర్బన్ జిల్లా కార్యదర్శిగా పని చేసి పార్టీ రాష్ట్ర సమితి సభ్యులుగా కొనసాగుతూ సిపిఐ పార్టీ అభివృద్ధి కోసం,దళిత ఉద్యమానికి విశేషంగా కృషి చేయడం జరిగిందని అన్నారు. నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు నిలబడ్డ వ్యక్తి మేకల రవి అని అన్నారు. రవి మరణం ఆ కుటుంబానికి,యావత్తూ సమాజానికి తీరని లోటని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ మాదాసి సురేష్, డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చుంచు నరేష్, న్యాయవాది బచ్చలకూర సారంగపాణి,రాజు, విజేందర్,సత్యం తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

- **పేదోళ్ల డాక్టర్ సేవలను ప్రభుత్వం గుర్తించాలి: ఏకు అనిల్ కుమార్**

బెస్ట్ వాయిస్,చిట్యాల:

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్వేరోస్ నాయకుడు, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ నాయకుడు ఏకు అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం భూపాలపల్లి జిల్లా చిట్యాలలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ఎన్ఎస్యూఐ ద్వారా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న రామకృష్ణ దళిత, ఆదివాసీ, బహుజన వర్గాల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు.రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా పేదలకు వైద్య, సామాజిక సేవలు అందిస్తూ 'పేదోళ్ల డాక్టర్'గా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పార్టీ కోసం పలు రాష్ట్రాల ఎన్నికల్లో ఇన్‌చార్జిగా పనిచేశారని, ఆయనకు మద్దతుగా 30 మందికి పైగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సిఫారసు లేఖలు అందించారని వెల్లడించారు. వరంగల్ ప్రెస్ క్లబ్‌లో 60కి పైగా ప్రజాసంఘాలు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలోనూ రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని తీర్మానించినట్లు తెలిపారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే శాసనమండలిలో పేదలు, బహుజనుల సమస్యలను బలంగా వినిపించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం చొరవ తీసుకోవాలని ఏకు అనిల్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

కాషాయ జెండా నీడలో ఎదిగి..
బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా గుండ మణికుమార్

- **చిట్యాల మండలానికి చెందిన మణికుమార్‌కు కీలక బాధ్యతలు**
- **నియామకంపై చిట్యాలలో కాషాయ శ్రేణుల సంబరాలు**

బెస్ట్ వాయిస్, చిట్యాల:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జిల్లా ఉపాధ్యక్షుడిగా చిట్యాల మండల కేంద్రానికి చెందిన గుండ మణికుమార్ నియమితులయ్యారు. చిన్ననాటి నుంచే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) భావజాలంతో ప్రభావితమై, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)లో సభ్యుడిగా చేరి విద్యార్థి సమస్యలపై చురుకుగా పోరాటం చేశారు.విద్యార్థి దశ నుంచే సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ యువతలో దేశభక్తి, జాతీయ భావాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేశారు. చిట్యాల మండలంలో పార్టీ బలోపేతానికి, యువతను సంఘటితం చేయడానికి ఆయన చేసిన సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం బీజేవైఎం జిల్లా కమిటీలో కీలక బాధ్యతలను అప్పగించింది.గుండ మణికుమార్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా చిట్యాల మండల కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించి ఆయనకు అభినందనలు తెలిపారు .ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన గుండ మణికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, రాష్ట్ర నాయకులు చందుపట్ల కీర్తి, సత్యపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషేధర్ రెడ్డి, నాగపూరి రాజమౌళి గౌడ్, బీజేపీ చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి, యువత అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గుండ మణికుమార్‌కు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. యువత సమస్యల పరిష్కారంలో ముందుండి, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలు

బెస్ట్ వాయిస్,పాలకుర్తి:

భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో వర్ధంతి వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ ఆత్మ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు మార్కెట్ చైర్మన్ లావుడియా మంజుల భాస్కర్ మాజీ అధ్యక్షుడు గిరగాని కుమార్ పులి గణేష్ బైకానీ ఐలేష్ బాలగాని యాకయ్య వల్లపు రవి గ్రామ నాయకులు గ్రామ పార్టీ అధ్యక్షులు సర్పంచులు జిల్లా ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తలు పాల్గొని ఇందిరాగాంధీ సేవలను స్మరించుకున్నారు.

తొర్రూరును కరువు మండలంగా ప్రకటించాలి

బెస్ట్ వాయిస్,తొర్రూరు:

తొర్రూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తొర్రూరు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నా రైతులను స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పరామర్శించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఒకవేళ ఆదుకోకుండా కాలయాపన చేస్తే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, యూత్ నాయకులు, సోషల్ మీడియా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు మేకల రవి పార్థివదేహానికి డా. పెరుమాండ్ల రామకృష్ణ నివాళులు

బెస్ట్ వాయిస్,వరంగల్:

సీపీఐ నాయకులు మేకల రవి గారి పార్థివదేహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా. పెరుమాండ్ల రామకృష్ణ ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డా. పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, మేకల రవి గారు పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం పనిచేశారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన పోరాటం, పేద ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.మేకల రవి గారి మరణం ప్రజా ఉద్యమాలకు, పేద ప్రజలకు తీరని లోటని డా. రామకృష్ణ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మేకల రవి గారి సేవలను స్మరించుకోవడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్, సీపీఐ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని మేకల రవి పార్థివదేహానికి నివాళులు అర్పించారు.

పొగాకు రహిత సమాజం"పై అవగాహన సదస్సు,ర్యాలీ

బెస్ట్ వాయిస్ ,ఆత్మకూరు:

ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీహెచ్ఎస్,ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మల కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల దుష్ఫలితాలపై నేడు అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ సిగరెట్, బీడీ, గుట్కా,ఇసిగరెట్ల వాడకం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండెజబ్బులు వస్తాయని, చిన్న వయస్సులోనే పొగాకు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పొగాకు వ్యతిరేక నినాదాల ప్లకార్డులతో ఆత్మకూరు వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల పరిసరాల 100 గజాల పరిధిలో పొగాకు అమ్మకాలు చట్టరీత్యా నేరమని, తమ బడిని 'పొగాకు రహిత విద్యాసంస్థ'గా కొనసాగిస్తామని ప్రధానోపాధ్యాయురాలు స్పష్టం చేశారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు పొగాకు వాడబోమని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మల కుమారి,డాక్టర్ స్పందన, ఉపాధ్యాయులు రాజు, సిహెచ్ఓ ఖలీమ్ జునైద్, సూపర్ వైజర్ రమేష్, ఉపాధ్యాయ బృందం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ వార్షిక తనిఖీలు

- **పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఏసీపీ సతీష్ బాబు**

బెస్ట్ వాయిస్,ఆత్మకూరు:

వార్షిక తనిఖీల్లో భాగంగా పరకాల ఏసీపీ సతీష్ బాబు ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, కేసుల నమోదు వివరాలు, పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై సీఐ జి బాబూలాల్‌ని ఆరా తీశారు.అనంతరం పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు పోలీస్ వ్యవస్థపై మరింత నమ్మకం పెరిగేలా విధులు నిర్వర్తించాలని, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నివారణ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.ఈ తనిఖీల సందర్భంగా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన గ్రామ యూత్ కాంగ్రెస్ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నిక

బెస్ట్ వాయిస్,ఆత్మకూర్:

ఆత్మకూరు మండలంలోని మల్కపేట ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, డిసిసి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదేశాల మేరకు, పరకాల నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ సూచనల మేరకు, మండల యూత్ అధ్యక్షులు తనుగుల సందీప్ ఆధ్వర్యంలో, మండల పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి అధ్యక్షతన మండలంలోని మల్కపేట గ్రామాలలో మండల యూత్ అధ్యక్షుడు తనుగుల సందీప్ ఆధ్వర్యంలో గ్రామ ఉప సర్పంచ్ బుస శివ సమక్షంలో నూతన గ్రామ యూత్ అధ్యక్షుడిగా బుస్సా సాయి కిరణ్ పూర్తి కమిటీ సభ్యులను ఏకీభవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలని,యువ నాయకులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, డిసిసి జిల్లా అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదేశాలతో ఎటువంటి కార్యక్రమాలకు పిలుపునిచ్చిన అట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మొగిలి, మండల యూత్ ప్రధాన కార్యదర్శి బండారి శివ, కాంగ్రెస్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ పర్యటనకు మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి

బెస్ట్ వాయిస్,కేసముద్రం:

కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి వ్యక్తిగత విదేశీ పర్యటనకు బయలుదేరుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సాదరంగా వీడ్కోలు పలికారు. శనివారం కేసముద్రం, ఇనుగుర్తి మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి విదేశీ పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆయన క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటూ ప్రయాణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి గంట సంజీవరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విదేశీ పర్యటన ఆయనకు ఆహ్లాదంతో పాటు నూతన ఉత్సాహాన్ని అందించాలని ఆకాంక్షించారు. సంజీవరెడ్డికి వీడ్కోలు పలికిన వారిలో కేసముద్రం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్, మాజీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు, ఇనుగుర్తి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, ఆర్టీఏ మెంబర్ రావుల మురళి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలెపాక నాగరాజు, దన్నసరి మాజీ ఉపసర్పంచ్ బానోతు వెంకన్న, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మూల భూలోక్ రెడ్డి, సీనియర్ నాయకులు పాయిరాల ప్రభాకర్, వేముల శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతా స్ఫూర్తితో ఏక్తా రన్

- **సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి.. పాల్గొన్న సీపీ శ్వేత**

బెస్ట్ వాయిస్,నుమకొండ:

ఉక్కు మనిషి, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏక్తా రన్ ఉత్సాహభరితంగా సాగింది. ఏజే పెడల్స్ సహకారంతో శనివారం హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి నిర్వహించిన ఈ పరుగును వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ప్రారంభించారు. ఆమె స్వయంగా పరుగులో పాల్గొని విద్యార్థులు, యువత, వాకర్స్‌ను ప్రోత్సహించారు. జాతీయ ఐక్యత, సమగ్రతను చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 5, 10 కిలోమీటర్ల విభాగాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రారంభమైన పరుగు వరంగల్‌లోని గోపాలస్వామి ఆలయం వరకు కొనసాగి, తిరిగి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకోవడంతో ముగిసింది. ట్రైసిటీ పరిధిలోని వివిధ కళాశాలల విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఏజే పెడల్స్ ప్రతినిధులు, పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఏక్తా రన్ జాతీయ ఐక్యత, సమగ్రత పట్ల ప్రజల్లో స్ఫూర్తిని నింపుతుందని అన్నారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం పటేల్ చేసిన అపారమైన సేవలను స్మరించుకుంటూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఇలాంటి కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవనశైలి, శారీరక దృఢత్వంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.జాతీయ ఐక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఐక్యత, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుంటూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పరుగు పోటీల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు చొప్పున విజేతలను ఎంపిక చేసి పోలీస్ కమిషనర్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అడిషనల్ డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, కమిషనరేట్ పరిధిలోని ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, ఏఆర్ విభాగం అడిషనల్ డీసీపీలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులు, రక్షణపై విద్యార్థులకు అవగాహన

- **పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్యవివాహాల నివారణపై న్యాయ, పోలీసు అధికారుల సూచనలు**

బెస్ట్ వాయిస్,పర్వతగిరి:

వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కులు, భద్రత, లైంగిక నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ వి.బి. నిర్మల గీతాంబ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, పిల్లలు వేధింపులకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ మాట్లాడుతూ.. పోక్సో చట్టం2012, బాలలపై లైంగిక నేరాలకు సంబంధించిన చట్టపరమైన రక్షణ, బాధితులకు అందించే ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. పర్వతగిరి సీఐ బాలల భద్రతలో పోలీసుల పాత్రను వివరిస్తూ బాల్యవివాహాలు, అక్రమ రవాణా, వేధింపులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. షీ టీమ్ ఎస్ఐ రామారావు బాలికల భద్రత, ఈవ్ టీజింగ్ నివారణపై, సైబర్ క్రైమ్ ఎస్ఐ శివకుమార్ ఆన్‌లైన్ మోసాలు, సైబర్ వేధింపులు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఆర్. సురేష్, పి. శ్రీనివాసరావు, ఆర్. రజినీ, వివిధ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

ఢిల్లీకి ఏనుగల్లు సర్పంచ్ తౌర్రి పద్మ

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఢిల్లీకి పయనం**

బెస్ట్ వాయిస్,పర్వతగిరి:

ఓటు చోరీ ఆరోపణలకు నిరసనగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నేడు నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామ సర్పంచ్ తౌర్రి పద్మ ఢిల్లీ పర్యటనకు బయలుదేరారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మరియు ఎమ్మెల్యే లు మంత్రులతో కలిసి ఆమె ఢిల్లీకి పయనమయ్యారు. జంతర్ మంతర్ వద్ద జరిగే ఈ నిరసన కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులతో కలిసి తౌర్రి పద్మ పాల్గొననున్నారు.

ఢిల్లీకి వెళ్లి సీఎం పదవి రెన్యూవల్ చేసుకోవాలి.. ఇక్కడికి వచ్చి ప్రతిపక్షాన్ని తిట్టాలి

- **రేవంత్ రెడ్డి పాలనపై గండ్ర వెంకట రమణారెడ్డి విమర్శలు**

బెస్ట్ వాయిస్,భూపాలపల్లి:

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో పాలనను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు, డైవర్షన్ రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తోందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు గండ్ర వెంకట రమణారెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాష్ట్ర సమస్యలను విస్మరిస్తున్నారని, ఢిల్లీకి వెళ్లి సీఎం పదవిని రెన్యూవల్ చేసుకోవాలి.. ఇక్కడికి వచ్చి ప్రతిపక్షాలను తిట్టాలి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. శనివారం భూపాలపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16, 28వ వార్డులు, రాంనగర్, సుభాష్ కాలనీలకు చెందిన సుమారు 100 మంది యువకులు గండ్ర వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన యువత పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, ఒడిసిఎంఎస్ మాజీ చైర్మన్ రామస్వామి నాయక్‌తో పాటు పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరువు నివారణలో ప్రభుత్వ నిర్లక్ష్యం

ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. గతంలో ప్రజలు తమకు అవకాశం ఇచ్చినప్పుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాలన సాగించామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తే ప్రజా సమస్యలను పరిష్కరించకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. సహకార, మార్క్‌ఫెడ్, సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా, పదవీకాలం ముగిసినప్పటికీ నామినేటెడ్ విధానాన్ని కొనసాగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందనే భయంతోనే ఎన్నికలు నిర్వహించేందుకు వెనుకడుగు వేస్తోందని విమర్శించారు.

రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడటానికి ప్రకృతి వైపరీత్యాలతో పాటు ప్రభుత్వ ముందస్తు ప్రణాళిక లోపం, సాగునీటి నిర్వహణలో నిర్లక్ష్యం కూడా కారణమని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించి కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్ల ద్వారా మల్లన్నసాగర్, ఎల్ఎండీ, మిడ్ మానేరు, శ్రీరాంసాగర్ వంటి జలాశయాలకు నీటిని తరలించి ఉంటే కరువు తీవ్రతను తగ్గించే అవకాశం ఉండేదన్నారు. రాజకీయ కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులను నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.

కరువు పరిస్థితులపై ముందుగానే అఖిలపక్ష సమావేశం నిర్వహించి తాగునీరు, పశుగ్రాసం, ఆహార ధాన్యాలు, నిత్యావసర వస్తువుల సరఫరా, ఉపాధి హామీ పనులపై సమగ్ర కార్యాచరణ రూపొందించాల్సి ఉండేదని పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లాలో 12 మండలాలు ఉండగా, అర్హత ఉన్న ప్రాంతాలను కరువు మండలాల జాబితాలో చేర్చకుండా రాజకీయ ప్రాతినిధ్యాలు, మంత్రుల సూచనల మేరకు ఎంపిక చేశారని ఆరోపించారు. కరువు మండలాల ఎంపికను పారదర్శకంగా చేపట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రైతులు, కార్మికులకు అన్యాయం

హైదరాబాద్‌లో 550 ఎకరాల భూమికి సంబంధించిన సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ముఖ్యమంత్రి చేస్తున్న ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని గండ్ర అన్నారు. హైడ్రా, ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ పేరుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అభివృద్ధి పనుల్లో ఇళ్లు కోల్పోయే బాధితులకు, చిరు వ్యాపారులకు తగిన పరిహారం, ప్రత్యామ్నాయ స్థలాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు మెడికల్ బోర్డుల ద్వారా న్యాయం చేయడం లేదని, తీవ్రమైన అనారోగ్య సమస్యలున్న వారిని కూడా అన్‌ఫిట్‌గా ప్రకటించకుండా సర్ఫేస్ విధుల్లో కొనసాగించడం కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడటమేనన్నారు. సింగరేణి లాభాల పంపిణీలోనూ కార్మికులకు తగిన న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు, సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని అన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై పిలుపు

రానున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని గండ్ర వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. నవంబర్ 6వ తేదీ ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే తమ విద్యార్హత ధ్రువపత్రాలతో సంబంధిత అధికారులను సంప్రదించి ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పట్టభద్రులను కలిసి అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వేరో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

ఇదిలా ఉండగా, నవంబర్ 22న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న స్వేరో సంస్థ ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను గండ్ర వెంకట రమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోజరీ బాలికల పాఠశాలలో వైభవంగా సైన్స్, ఆర్ట్ ఎగ్జిబిషన్

- **విద్యార్థుల సృజనాత్మకతకు అద్దంపట్టిన ఆకట్టుకునే ప్రాజెక్టులు**
- **ఆచరణాత్మక జ్ఞానమే విద్యార్థుల సమగ్ర వికాసానికి మూలం**
- **ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జోస్ఫిన్**

బెస్ట్ వాయిస్,హైదరాబాద్:

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, శాస్త్రీయ దృక్పథాన్ని, నూతన ఆలోచనలను వెలికితీసే లక్ష్యంతో గన్‌ఫౌండ్రీలోని రోజరీ బాలికల పాఠశాలలో శనివారం విజ్ఞాన, గణిత, సాంఘిక, సాంకేతిక, సాహిత్య, సాంస్కృతిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జోస్ఫిన్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు, న్యాయనిర్ణేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనలో పర్యావరణ పరిరక్షణ, విద్య, సామాజిక అంశాలతో పాటు వివిధ రంగాలకు సంబంధించిన వినూత్న ప్రాజెక్టులను విద్యార్థినులు ఆకట్టుకునేలా ప్రదర్శించారు. ప్రతి ప్రాజెక్టు వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలు, వాటి ఉపయోగాలు, సామాజిక ప్రాధాన్యతను ఎంతో ఆత్మవిశ్వాసంతో వివరించి తమ ప్రతిభాపాటవాలను చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జోస్ఫిన్ మాట్లాడుతూ.. పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మక జ్ఞానం విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో పరిశోధనాత్మక దృక్పథం, సమస్యల పరిష్కార నైపుణ్యం, బృంద స్ఫూర్తి, వేదికపై మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు తల్లిదండ్రులు, సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విద్యార్థినుల నమూనాలను, ప్రాజెక్టులను అభినందించారు. యాజమాన్యం, ఉపాధ్యాయుల సహకారం, విద్యార్థినుల శ్రమతో ప్రదర్శన విజయవంతమైంది. రోజరీ బాలికల పాఠశాల విద్యా ప్రమాణాలకు, విద్యార్థినుల బహుముఖ ప్రజ్ఞకు ఈ వేడుక నిదర్శనంగా నిలిచింది.

స్వచ్ఛమైన నెయ్యి అందించడం సమాజ ఆరోగ్యానికి ఎంతో కీలకం

- **శ్రీ చిన్న జీయర్ స్వామి**

బెస్ట్ వాయిస్,హైదరాబాద్:

స్వచ్ఛమైన నెయ్యి అందించడం అనేది కేవలం వ్యాపారమే కాదు, ప్రజా ఆరోగ్యంతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన అంశమని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి పేర్కొన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఆశీర్వాద్ ఫుడ్స్ కార్యాలయంలో ఆ సంస్థ సొంత బ్రాండ్ 'కామధేను సెలెక్ట్ నెయ్యి' మరియు దాని ఫుడ్‌గ్రేడ్ టెట్రా ప్యాక్‌లను శ్రీ చిన్న జీయర్ స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ... పాడి రైతుల నుండి నేరుగా పాలను సేకరించి, సాంప్రదాయ పద్ధతిలో తోడుపెట్టి, పెరుగును చిలికిన వెన్నతో నెయ్యిని తయారుచేస్తున్న ఆశీర్వాద్ ఫుడ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. నెయ్యి తయారీలో పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలను పాటించడమే కాకుండా, వినియోగదారులకు పారదర్శకంగా అందించడం వల్ల నమ్మకం పెరుగుతుందని, ఇలాంటి స్వచ్ఛమైన ఆహార పదార్థాలు ప్రజారోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ వేణుగోపాలచారి, ఆశీర్వాద్ ఫుడ్స్ ప్రతినిధులు గోవింద్ అగర్వాల్, రేణు అగర్వాల్, కునాల్ అగర్వాల్, రితిక, చవి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ ఇంచార్జీగా రామారపు శ్రీనివాస్ మాదిగ

బెస్ట్ వాయిస్,హైదరాబాద్:



మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) గ్రేటర్ హైదరాబాద్ ఇంచార్జీగా రామారపు శ్రీనివాస్ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ శనివారం ప్రకటన విడుదల చేశారు. కాచిగూడ ఎస్సీ హాస్టల్‌కు చెందిన రామారపు శ్రీనివాస్ మాదిగ ఇప్పటి వరకు ఎంఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సేవలందించారు. తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రామారపు శ్రీనివాస్ శనివారం బాగ్ అంబర్‌పేటలో మంద కృష్ణమాదిగను కలిసి పూలబోకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామారపు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మంద కృష్ణ గారి నాయకత్వంలో ఎంఎస్ఎఫ్ ను మరింత బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో, హాస్టళ్లలో ఎంఎస్ఎఫ్ కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎంఎస్ఎఫ్ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు.

ఎల్‌నినో కరువుపై పాట సీడీని ఆవిష్కరించిన వరంగల్ కలెక్టర్

బెస్ట్ వాయిస్, పర్వతగిరి:

పర్వతగిరి మండలం చౌటపల్లికి చెందిన కళాకారుడు గౌరారపు డప్పు యుగేందర్ ఎల్‌నినో కరువు ప్రభావంపై రచించిన పాట సీడీని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద ఐఏఎస్, జాయింట్ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డీపీఆర్వో ప్రేమలతతో పాటు జిల్లా ఉన్నతాధికారులు ఆవిష్కరించారు. ఈ పాటకు జూపాక శివ గానం అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి వరంగల్ జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

పటేల్ సేవలు దేశానికి గర్వకారణం

- **సీపీ శ్వేత**

బెస్ట్ వాయిస్,హనుమకొండ:

దేశ సమగ్రత, ఐక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. ఆయన దేశానికి అందించిన సేవలు ప్రతి భారతీయుడికీ గర్వకారణమని కొనియాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవం (ఏక్తా దివాస్) సందర్భంగా శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పటేల్ చిత్రపటానికి సీపీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానంతరం దేశంలోని సంస్థానాల విలీనంలో పటేల్ కీలక పాత్ర పోషించి, భారతదేశ ఐక్యతకు పునాది వేశారని గుర్తుచేశారు. ఉక్కు మనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలు, దేశం కోసం ఆయన చేసిన కృషి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అడిషనల్ డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, ఏసీపీలు మధుసూదన్, జానీ నరసింహులు, ఏఆర్ అదనపు డీసీపీలు సురేష్, శ్రీనివాస్, ఏఆర్ విభాగానికి చెందిన ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి పోలీసుల భద్రతా అవగాహన.. 'కమ్యూనిటీ కనెక్ట్'కు శ్రీకారం

- **నేరాల నివారణలో ప్రజలను భాగస్వాములను చేస్తాం: వరంగల్ సీపీ శ్వేత**

బెస్ట్ వాయిస్,వరంగల్:

నేరాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడమే కాకుండా, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వరంగల్ పోలీస్‌కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు.పోలీసులేనేరుగా ప్రజల వద్దకు వెళ్లి, ఇంటింటికీ వివిధ రకాల నేరాలు, మోసాల నివారణపై అవగాహన కల్పిస్తారని వెల్లడించారు.ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రథమ ప్రాధాన్యతని, ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, ఆస్తిసంబంధిత నేరాలు, దృష్టి మరల్చి చేసే దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులను గుర్తించి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తామన్నారు.సాధారణంగా పోలీస్ శాఖ నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు హాజరుకాలేకపోతున్నారని, ముఖ్యంగా ఇంటి వద్ద ఉండే మహిళలు, చిన్నారులు, వృద్ధులకు కూడా భద్రతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు.ప్రతి కుటుంబానికి నేరాల నివారణకు సంబంధించిన సమాచారం చేరవేయడమే ప్రధాన లక్ష్యమన్నారు.

ఎనిమిది అంశాలపై అవగాహన

కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా ఎనిమిది అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. సైబర్ నేరాల్లో భాగంగా నకిలీ ఫోన్ కాల్స్, మోసపూరిత లింకులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలపై హెచ్చరిస్తారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచిస్తారు.సోషల్ మీడియా భద్రతలో భాగంగా నకిలీ ఖాతాలు, ఆన్‌లైన్ వేధింపులు, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించి వేధింపులు, నేరాలను గుర్తించడం, ప్రమాదకర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఆస్తి సంబంధిత నేరాల నివారణకు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం, పరిసరాలపై నిఘా ఉంచడం వంటి సూచనలు అందిస్తారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థలు, కాలనీల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాల నియంత్రణతో పాటు నేరగాళ్ల గుర్తింపునకు ఉపయోగపడుతుందని వివరిస్తారు.అదేవిధంగా ప్రజల దృష్టిని మరల్చి నగదు, నగలు, విలువైన వస్తువులను అపహరించే ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటి అక్రమ రవాణా, నిల్వ, విక్రయాల నివారణపై అవగాహన కల్పిస్తారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరుతారు. అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినప్పుడు పోలీసులకు సమాచారం అందించడం, అత్యవసర పరిస్థితుల్లో సహాయం పొందడం వంటి వ్యక్తిగత భద్రతా అంశాలను కూడా వివరిస్తారు.

తొలుత తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో అమలు

ఈ కార్యక్రమాన్ని తొలుత వరంగల్ నగర పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో అమలు చేసి, అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు విస్తరించనున్నట్లు సీపీ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బంది ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, నేరాల నివారణకు అవసరమైన సూచనలు అందిస్తారని తెలిపారు.పోలీసులకు, ప్రజలకు మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడం, నేరాల నియంత్రణలో ప్రజలను భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసుల సూచనలు పాటించాలని, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యం, అప్రమత్తతతోనే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని సీపీ ఎన్. శ్వేత పేర్కొన్నారు.

బెస్ట్ వాయిస్ కథనానికి స్పందన.. అన్నారం దర్గాలో మైనారిటీ సంక్షేమ అధికారి తనిఖీలు

- **వసూళ్ల ఆరోపణలపై నిర్వాహకులపై ఆగ్రహం..**
- **గోప్యంగా తనిఖీలు చేయడంపై అనుమానాలు**

బెస్ట్ వాయిస్,పర్వతగిరి:

అన్నారం దర్గాలో భక్తుల నుంచి అక్రమ వసూళ్లు జరుగుతున్నాయంటూ బెస్ట్ వాయిస్ దినపత్రికలో శుక్ర, శనివారాల్లో ప్రచురితమైన కథనాలపై వరంగల్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్ స్పందించారు. శనివారం ఆయన అన్నారం దర్గాను తనిఖీ చేసి, వసూళ్ల ఆరోపణలపై నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే ఈ తనిఖీలను గోప్యంగా నిర్వహించడం, తనిఖీలో ఏం జరిగింది? ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను మీడియాకు వెల్లడించకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భక్తుల నుంచి వస్తున్న ఆరోపణలపై అధికారులు బహిరంగంగా విచారణ వివరాలు వెల్లడించి, తీసుకున్న చర్యలపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఈ తనిఖీలో వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సులభతరంగా గ్రావెల్ అనుమతులు

- **అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేసేలా నూతన ఆన్‌లైన్ విధానం**
- **ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా అనుమతుల జారీ : కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

బెస్ట్ వాయిస్,హనుమకొండ:

చిన్న నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన గ్రావెల్ (మట్టి) తరలింపునకు అనుమతులు సులభతరం చేసేందుకు జిల్లాలో సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. నూతన ఆన్‌లైన్ విధానం ద్వారా ప్రజలు సులభంగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేయనున్నట్లు పేర్కొన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నూతనంగా అమలులోకి తీసుకురానున్న సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానంపై తహసీల్దార్లు, సాగునీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సహకారంతో ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పేరుతో ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ రూపొందించినట్లు తెలిపారు. గ్రావెల్ అవసరమైన వారు గతంలో అనుమతులు పొందడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ఈ విధానాన్ని రూపొందించినట్లు వివరించారు. చిన్న పరిమాణంలో మట్టి అవసరమైన వారు సైతం పోర్టల్ ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చని, రెవెన్యూ అధికారులు దరఖాస్తులను పరిశీలించి భూముల వివరాలను ధ్రువీకరించిన అనంతరం అనుమతులు మంజూరు చేస్తారని చెప్పారు.

పట్టా భూముల నుంచి కూడా నిబంధనలకు అనుగుణంగా గ్రావెల్ తరలించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. గతంలో సాగునీటి కాలువల నిర్మాణ సమయంలో నిల్వ చేసిన గ్రావెల్‌ను ముందుగా వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ నిల్వలను తొలగించడం ద్వారా విలువైన ప్రభుత్వ భూమిని తిరిగి వినియోగించుకునే అవకాశం ఉంటుందని, భవిష్యత్తులో ప్రభుత్వ సంస్థలు, ప్రజాప్రయోజన కార్యక్రమాలకు ఆ భూములను ఉపయోగించవచ్చని పేర్కొన్నారు. చెరువులు, సాగునీటిపారుదల శాఖ పరిధిలోని ప్రాంతాల నుంచి మట్టి తరలింపునకు దరఖాస్తులు వచ్చినప్పుడు వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపించి అభిప్రాయాలు, సిఫార్సులు పొందే వెసులుబాటు కూడా పోర్టల్‌లో కల్పించినట్లు తెలిపారు. అనుమతులు మంజూరైన తర్వాత గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కీలక బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. అనుమతి పొందిన వ్యక్తులు ఎన్ని వాహనాల్లో, ఎన్ని ట్రిప్పుల ద్వారా, ఎంత పరిమాణంలో గ్రావెల్ తరలిస్తున్నారనే వివరాలను గ్రామస్థాయిలో నమోదు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. నూతన విధానం అమలుతో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాను నియంత్రించడంతో పాటు అనుమతుల జారీలో పారదర్శకత పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా గ్రామపంచాయతీలకు కూడా ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అనుమతుల ప్రక్రియను సరళీకరించడం, అక్రమ మైనింగ్‌ను అరికట్టడం ఈ విధానం ప్రధాన ఉద్దేశమని, త్వరితగతిన అమల్లోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం సీజీజీ ప్రతినిధులు నూతన పోర్టల్ పనితీరు, దరఖాస్తు విధానం, అనుమతుల పరిశీలన, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు లేవనెత్తిన సందేహాలను కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, మైనింగ్ శాఖ ఏడీ రామాచారి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మూడేళ్ల పాలనకు లెక్క చెప్పాలి

- **బొట్ల మధు**

బెస్ట్ వాయిస్, పర్వతగిరి:

కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేసే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో తెలంగాణకు చేసిన అభివృద్ధి, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొట్ల మధు డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో వ్యవసాయ రంగానికి తోడ్పాటు అందించామని పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో లోపాలుంటే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రాజకీయ ఆరోపణలతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ప్రాజెక్టుల వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ సాగునీరు, తాగునీటి అవసరాలు తీర్చుకోగలుగుతోందని ఆయన పేర్కొన్నారు. రైతులకు సాగునీరు, నిరంతర విద్యుత్ అందించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని బొట్ల మధు తెలిపారు.

తిప్పరోని కుంట బండ్ అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించాలి

- **మొక్కల పెంపకం, విద్యుత్ దీపాలతో కట్ట సుందరీకరణ**
- **అధికారులకు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశం**

బెస్ట్ వాయిస్,హనుమకొండ:

ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్‌లోని తిప్పరోని కుంట చెరువు కట్టపై చేపట్టనున్న బండ్ అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి, నాణ్యతతో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. చెరువు కట్టను ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా, వాకింగ్‌కు అనువుగా తీర్చిదిద్దాలని సూచించారు. శనివారం మున్సిపల్, సాగునీటిపారుదల, సర్వే శాఖల అధికారులతో కలిసి తిమ్మాపూర్‌లోని తిప్పరోని కుంటను కలెక్టర్ పరిశీలించారు. చెరువు కట్ట ప్రారంభం నుంచి చివరి వరకు విస్తీర్ణాన్ని పరిశీలించి, చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కుంట విస్తీర్ణం, బండ్ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువు కట్టపై వివిధ రకాల మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఇందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసి, ప్లాంటేషన్ పనులు చేపట్టాలన్నారు. బండ్‌పై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు కట్ట సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజలు సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరడంతో పాటు వాకింగ్ చేసుకునేందుకు వీలుగా తిప్పరోని కుంట బండ్‌ను అభివృద్ధి చేయాలని తెలిపారు. పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి, నిర్ణీత సమయంలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజయ్, సాగునీటిపారుదల శాఖ ఈఈ కిరణ్ కుమార్, డీఈ మధుసూదన్ రెడ్డి, సర్వేయర్ సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కూచిపూడి లో జాతీయ స్థాయి ప్రథమ బహుమతి అందుకున్న సాయి త్రిపుర

బెస్ట్ వాయిస్,వరంగల్:

వరంగల్ నగరంలోని రంగశాయిపేట ప్రాంతానికి చెందిన బ్రహ్మశ్రీ వెలిదె ప్రదీప్ శాస్త్రి చంద్రకళ ల కుమార్తె వెలిదె సాయి త్రిపుర కూచిపూడి నాట్యం సోలో విభాగంలో జాతీయ స్థాయి మొదటి బహుమతి తో పాటు నృత్య హిరణ్మయి అవార్డును కూడా అందుకున్నారు. నృత్యానంద లహరి డాన్స్ ఫెస్ట్ 2026 లో భాగంగా ఆల్ ఇండియా డాన్సర్స్ అసోసియేషన్ (ఏఐడిఏ) ఆధ్వర్యంలో అక్టోబర్ 16 నుండి 27 వరకు ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని రాయిపూర్ లో నిర్వహించిన నేషనల్ అవార్డు అండ్ ఆల్ ఇండియా మ్యూజిక్ అండ్ డాన్స్ కాంపిటీషన్ లో సాయి త్రిపుర పాల్గొన్నారు. కూచిపూడి లో సీనియర్ విభాగంలో సోలో నాట్యంలో అత్యంత ప్రతిభ కనబరిచిన సాయి త్రిపుర ఏ ప్లస్ గ్రేడ్ తో జాతీయస్థాయి మొదటి బహుమతి తో పాటు నృత్య హిరణ్మయి అవార్డుకు కూడా ఎంపికయ్యారు. హనుమకొండ కు చెందిన హిమన్సీ కాట్రగడ్డ వద్ద సాయి త్రిపుర కూచిపూడి నాట్యం నేర్చుకుంటున్నది. ఈ కూచిపూడి నృత్యంలో జాతీయ స్థాయి మొదటి బహుమతి అందుకున్న సాయి త్రిపుర ను తన గురువు హిమన్సీ కాట్రగడ్డ తో పాటు జిల్లా వాసులు, రంగశాయిపేట ప్రాంత ప్రజలు ఈ సందర్భంగా అభినందించి అభినందనలు తెలిపారు.

‘ఓట్ బచావో – దేశ్ బచావో’ కార్యక్రమానికి కాంగ్రెస్ నేతల పయనం

- **ఢిల్లీ కార్యక్రమానికి హనుమకొండ నుంచి ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన నాయకులు**
- **బస్సులకు జెండా ఊపి ప్రారంభించిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

బెస్ట్ వాయిస్,హనుమకొండ:

ఢిల్లీలో ఆదివారం నిర్వహించనున్న ‘ఓట్ బచావో - దేశ్ బచావో’ కార్యక్రమంలో పాల్గొనేందుకు హనుమకొండ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు శనివారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ నుంచి ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి పయనమయ్యారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండా ఊపి ప్రత్యేక బస్సులను ప్రారంభించారు. శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం అక్కడి నుంచి విమానంలో ఢిల్లీకి వెళ్లనున్నారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ, పరకాల, స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నాయకులు సమాయత్తమయ్యారు.

పట్టభద్రుల ఓటు నమోదును వేగవంతం చేయాలి

- **అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి: జోగు గోపి**
- **పెద్దతండ (బి)లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలన**

బెస్ట్ వాయిస్,జనగామ:

అర్హులైన ప్రతి పట్టభద్రుడు వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ జిల్లా నాయకుడు జోగు గోపి పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం పెద్దతండ (బి) గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని జోగు గోపి, బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకుడు జరుపుల బాలు నాయక్, గ్రామ సర్పంచ్ లకావత్ తిరుపతి నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రుల వివరాలను సేకరించి, ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేశారు.ఈ సందర్భంగా జోగు గోపి మాట్లాడుతూ పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు ఇతర అర్హులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేసిందనే అంశంపై పట్టభద్రులు ఆలోచించాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న పోరాటానికి పట్టభద్రులు మద్దతుగా నిలవాలని కోరారు. 'మీ ఓటు మీ గొంతుక.. మీ ఓటు మీ భవిష్యత్తుకు బాట' అని పేర్కొంటూ ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల యువజన నాయకుడు లకావత్ వెంకట్ నాయక్‌తో పాటు జలగం నాగరాజు, సోమ్లా, టైర్య, రఘు, తారీ తదితరులు పాల్గొన్నారు.

భర్త చనిపోతే.. భార్యకు వెంటనే పింఛను!

తరువాయి భాగం

శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు వృద్ధాప్య పింఛనుదారుడి భార్యకు మాత్రమే భర్త మరణించిన వెంటనే పింఛను మంజూరు చేసే విధానం అమల్లో ఉండేది. తాజా మార్పులతో ఇతర సామాజిక భద్రతా పింఛనుదారుల భార్యలకూ ఈ ప్రయోజనం అందనుంది. దివ్యాంగుల పింఛను పొందుతున్న పురుష లబ్ధిదారులు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్ చికిత్స పొందుతున్నవారు, హెచ్ఐవీతో జీవిస్తున్నవారు, ఫైలేరియా బాధితుల కుటుంబాలకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగించనుంది. ఆయా కేటగిరీల్లో పింఛను పొందుతున్న వ్యక్తి మరణిస్తే, అర్హత కలిగిన భార్యకు వయస్సు ఆధారంగా ప్రత్యామ్నాయ పింఛను మంజూరు చేస్తారు.

వయస్సును బట్టి పింఛను కేటాయింపు

ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం మరణించిన పురుష పింఛనుదారుడి భార్య వయస్సు 57 సంవత్సరాల కంటే తక్కువగా ఉంటే వితంతు పింఛను మంజూరు చేస్తారు. 57 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉంటే వృద్ధాప్య పింఛను అందిస్తారు. ఈ విధానం ద్వారా భర్త మరణించిన వెంటనే మహిళలకు సామాజిక భద్రత కొనసాగించేలా చర్యలు చేపట్టారు. కుటుంబానికి వస్తున్న పింఛను అకస్మాత్తుగా నిలిచిపోవడం వల్ల మహిళలు ఎదుర్కొనే ఆర్థిక సమస్యలను తగ్గించడం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం.

దరఖాస్తు ఎక్కడ చేయాలంటే?

గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన మహిళలు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు సమర్పించాలి. పట్టణ ప్రాంతాల్లో సంబంధిత బిల్ కలెక్టర్‌ను సంప్రదించాలి. దరఖాస్తుతో పాటు భార్య ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ, మరణించిన భర్త ఆధార్ కార్డు, ఆయన మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది.

చేయూత పోర్టల్ ద్వారా పరిశీలన

దరఖాస్తులు అందిన తర్వాత సంబంధిత అధికారులు సమర్పించిన పత్రాలను పరిశీలిస్తారు. అనంతరం అర్హురాలి వివరాలను చేయూత పోర్టల్‌లో నమోదు చేస్తారు. వయస్సు, ఇతర అర్హతలను ధ్రువీకరించిన తర్వాత పింఛను మంజూరుకు చర్యలు తీసుకుంటారు. తద్వారా అర్హులైన మహిళలకు పింఛను అందించడంలో జాప్యాన్ని తగ్గించడంతో పాటు, భర్త మరణించిన తర్వాత కుటుంబానికి ఆర్థిక సహాయం నిరంతరాయంగా అందేలా ప్రభుత్వం ఈ విధానాన్ని విస్తరించింది.

ఫిబ్రవరి 24 నుంచి ఇంటర్ పరీక్షలు!

తరువాయి భాగం

అవకాశముంది. పరీక్షల నిర్వహణకు సంబంధించి బోర్డు నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ఫిబ్రవరి 24 నుంచి థియరీ పరీక్షలు

2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను గత ఏడాదితో పోలిస్తే ఒక రోజు ముందుగా ప్రారంభించే యోచనలో బోర్డు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదన ప్రకారం ఫిబ్రవరి 24 నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అయితే ఏయే తేదీల్లో ఏయే సబ్జెక్టుల పరీక్షలు నిర్వహించాలనే అంశంపై పూర్తి వివరాలతో కూడిన తుది షెడ్యూల్‌ను ఇంకా విడుదల చేయలేదు. అధికారిక టైమ్‌టేబుల్ ప్రకటించిన తర్వాతే పరీక్షల తేదీలు ఖరారవుతాయి.

ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్స్

థియరీ పరీక్షలకు ముందుగానే ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు బోర్డు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభించే అవకాశం ఉంది. గత ఏడాది ఫిబ్రవరి 2 నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించగా, ఈసారి ఒక రోజు ముందుగానే ప్రారంభించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రయోగ పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, పరీక్షల షెడ్యూల్ రూపకల్పనపై అధికారులు దృష్టి సారించారు.ఈసారి ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం ప్రత్యేక అంశంగా మారనుంది. ముఖ్యంగా ఎంపీసీ (గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం), బైపీసీ (జీవశాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం) గ్రూపుల విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం. గతంలో ప్రధానంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులకే బాహ్య ప్రయోగ పరీక్షలు ఉండేవి. అయితే గత ఏడాది నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులకూ ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ ఏడాది కూడా రెండు సంవత్సరాల విద్యార్థులకు బాహ్య ప్రాక్టికల్స్ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించి జూలైలోనే బోర్డు ప్రకటన చేసినట్లు సమాచారం. ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారిక పరీక్షల షెడ్యూల్‌ను అక్టోబర్ చివరి వారంలో విడుదల చేస్తుందని తొలుత భావించారు.

ఉద్యోగ విరమణ పొందిన కుమారస్వామికి సన్మానం

బెస్ట్ వాయిస్,వరంగల్,

వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాడెపల్లిలో శనివారం రోజున స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) ఉద్యోగ విరమణ పొందుతున్న చిగిరి ఉషారాణి కుమారస్వామి గారికి సన్మాన అభినందన సభ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. జెడ్పిహెచ్ఎస్ గాడేపల్లి హెడ్మాస్టర్ టి వెంకన్న జ ,టి ప్రవీణ్ కుమార్ జి పాపిరెడ్డి ,వై కృష్ణవేణి ,జి వినోద ,ఎం సరళ ,వి కవిత సి హెచ్ ఎస్ సుదర్శన్, ఉపాధ్యాయులందరూ కలిసి చిగిరి ఉషారాణి కుమారస్వామి ఉద్యోగ పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు టి వెంకన్న మాట్లాడుతూ కుమారస్వామి సార్ గారు విద్యా బోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొన్నందుకు అభినందనలు తెలియజేశారు. వారు పదవి విరమణ తర్వాత మంచి ఆరోగ్యాన్ని అష్టైశ్వర్యాలను ప్రసాదించాలని ఆ భగవంతున్ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మిత్ర పరపతి సంఘం కమిటీ సభ్యులు, జనతా పరపతి సంఘం కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సంక్షేమ పరపతి సంఘం కమిటీ సభ్యులు,చిగిరి భరత్ కుమార్ మధుమిత వచన్ కుమార్ చిగిరి సామ్రాట్ మానస శణ్ముఖి రాగుల మనీషరాగుల శ్రీనివాస్ కార్తికేయ మల్లేష్వి శ్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి, సర్దార్ పటేల్ జయంతి వేడుకలు

- **దేశ సమగ్రత, ఐక్యతకు ఇద్దరు మహనీయుల సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే నాయిని**

బెస్ట్ వాయిస్,హనుమకొండ:

భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 42వ వర్ధంతి, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత, ఐక్యత కోసం జీవితాలను అంకితం చేసిన ఇద్దరు మహనీయులను ఒకే రోజు స్మరించుకోవడం గర్వకారణమన్నారు. వందలాది సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి అఖండ భారత నిర్మాణానికి పునాది వేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో ఆయన ప్రదర్శించిన దృఢ సంకల్పం, నాయకత్వ పటిమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు. అదేవిధంగా ఇందిరా గాంధీ దేశాభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం తీసుకున్న కీలక నిర్ణయాలు భారత చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని అన్నారు. 'గరీబీ హటావో' నినాదంతో పేదల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు బ్యాంకుల జాతీయీకరణ, భూసంస్కరణల వంటి నిర్ణయాలతో సామాజిక, ఆర్థిక రంగాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన ఇందిరా గాంధీ సేవలు, త్యాగం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని నాయకులు తెలిపారు. హనుమకొండ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళి, వరంగల్ ఎనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, మాజీ కార్పొరేటర్లు, డీసీసీ కమిటీ సభ్యులు, మండల, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published & Owned by Kowdagani Jyothi Printed at VM Printers H.No. 8-10-37, Radhika Theatre, Warangal.Telangana- 506002. Published at # 16-1-558/2 SRR Thota,Kareemabad, Warangal. Telangana -506002. Editor: Kowdagani Mohan Rao, RNI No.TELTEL/2016/68994. Cell:9963334550, email: bestvoicenews@gmail.com